క్లుప్తంగా

కార్మికుల సంక్షేమానికి కృషి



కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ సతీష్

నస్పూర్: మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు విధుల్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా పీపీఈ కిట్లు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

మందమర్రిరూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మందమర్రి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కౌషిక్ అనే విద్యార్థి ఎంపికయ్యాడు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో గల హావెన్ హోప్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కౌషిక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కౌషిక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజతో పాటు సిబ్బంది అభినందించారు.

అక్రమ ఇసుక నిల్వలు సీజ్

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి, తాళ్లపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సుమారు 135ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు, ఎవరైనా అక్రమంగా ఇసుకను నిల్వచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ చందర్, సాండ్ రీచ్ ఆఫీసర్ (మైన్స్) రాహుల్ హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు కాయకల్ప పురస్కారాలు

మంచిర్యాలటౌన్: మెరుగైన పనితీరును కనబరుస్తున్న ఆరోగ్య కేంద్రాలకు కాయకల్ప పురస్కారాలు లభించాయి. జిల్లాలోని బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పురస్కారానికి ఎంపిక కాగా రూ.2 లక్షలు, రన్నరప్‌లుగా నిలిచిన దండేపల్లి, అంగ్రాజ్‌పల్లి, హాజీపూర్, కోటపల్లి, మందమర్రి, నెన్నెల పీహెచ్‌సీలకు రూ.50 వేలు చొప్పున అందించనున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ల విభాగంలో బెల్లంపల్లి మండలం శంశీర్‌నగర్ యూపీహెచ్‌సీ కాయకల్ప పురస్కారానికి ఎంపిక కాగా, రూ.2లక్షలు, రన్నరప్‌గా రాజీవ్‌నగర్, దీపక్‌నగర్ యూపీహెచ్‌సీలకు రూ.50 వేల చొప్పున అందిస్తారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలుగా ఉన్న సబ్‌సెంటర్లలో దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఎంపిక కాగా రూ.లక్ష, ఫస్ట్‌రన్నరప్‌గా నిలిచిన సోమగూడెం కేంద్రానికి రూ.50వేలు, సెకండ్ రన్నరప్‌గా నిలిచిన దొనబండకు రూ.35 వేలు, దీపక్‌నగర్, గూడెం, యాపల్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు రూ.25 వేల చొప్పున ఇవ్వనున్నారు.

విధుల్లో చేరిన స్టాఫ్ నర్సులు

వేమనపల్లి: వేమనపల్లి పీహెచ్‌సీకి ఎన్నో సంవత్సరాల తర్వాత ముగ్గురు స్టాఫ్ నర్సులను ప్రభుత్వం కేటాయించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శివరంజని, మంచిర్యాలకు చెందిన శృతి, రజిత మంగళవారం విధుల్లో చేరారు. స్టాఫ్ నర్సులు విధుల్లో చేరడంతో పీహెచ్‌సీ పరిధిలో 24గంటల వైద్యం అందే అవకాశం ఉందని, సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు కృతజ్ఞతలు స్థానికులు తెలియజేశారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వృద్ధులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ టెస్టులు చేసి, మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో అవసరమైన వారికి మందులు అందించారు.

వృద్ధులకు సత్కారం

దండేపల్లి: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దండేపల్లి మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వృద్ధదేవో భవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు వృద్ధులను విద్యార్థులు సన్మానించారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..

- విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు
- ఆడిపాడిన ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

భీమారం/మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/కోటపల్లి/జన్నారం/దండేపల్లి/తాండూర్/చెన్నూర్ రూరల్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/జైపూర్: జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలను మంగళవారం విద్యార్థినులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రభుత్వం ఈ నెల 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సెలవులు ప్రకటించడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. ప్రకృతిలో విరబూసిన తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి తదితర రకాల పూలతో అందంగా బతుకమ్మను పేర్చి మధ్యలో గౌరమ్మను పెట్టి, ఒక్కేసి పువ్వేసి.. చందమామ.. ఒక్క జాములాయే చందమామ అంటూ ఉత్సాహంగా ఆడి పాడారు. విద్యాసంస్థల్లో బతుకమ్మ, గౌరమ్మ పాటలు ప్రతిధ్వనించాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో బాలికలు బతుకమ్మ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. చిన్నారుల కోలాట నృత్యాలు అలరించాయి.



ట్రినిటీ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



శ్రీ చైతన్య పాఠశాలలో..



మిమ్స్ కళాశాలలో...



అల్ఫోర్స్ పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు



భీమారం హైస్కూల్‌లో...



కోటపల్లి: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



బెల్లంపల్లి: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో...



జన్నారం వివేకానంద పాఠశాలలో...



దండేపల్లి: వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో...



తాండూర్: బారేపల్లి ఎంపీపీఎస్‌లో...



చెన్నూర్‌రూరల్: పొక్కూరు జెడ్పీఎస్ఎస్‌లో...



రామకృష్ణాపూర్: ఎస్ఆర్‌కే స్కూల్‌లో...



జైపూర్‌లో బతుకమ్మ ఆడుతూ...

ఆడపడుచులకు అండగా ఎమ్మెల్యే పీఎస్సార్



చీరలు పంపిణీ చేస్తున్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: పేద ప్రజలకు, ఆడపడుచులకు ఎల్లవేళలా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండగా నిలుస్తారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు నుంచి 36వ వార్డుల్లోని మహిళలకు మంగళవారం కొక్కిరాల రఘుపతిరావు చారిటబల్ ట్రస్టు ద్వారా బతుకమ్మ కానుకగా తన కోడలు శైలేఖ్య, ఆడపడుచులు రుక్మిణి, సత్యశ్రీలతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే బతుకమ్మ చీరల పంపిణీ, తాగునీటి ట్యాంకర్లతో నీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీయూ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సింగ్ ఆఫీసర్ 4 పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ 1, రేడియాలజీ 1, ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో 1 పోస్టులకు దరఖాస్తులు స్వీకరించామని, మెరిట్ జాబితాను కళాశాల నోటీసు బోర్డుపై ఉంచామని, అభ్యంతరాలు ఉంటే పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నెల 8వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.

వార్డెన్‌ను తొలగించాలని పీడీఎస్‌యూ నిరసన



దొనబండ ఎస్సీ హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ ఎస్సీ బాలుర వసతీ గృహం వార్డెన్‌ని తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వసతీ గృహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. దొనబండ ఎస్సీ వసతీ గృహం వార్డెన్ విధులు సక్రమంగా నిర్వహించకుండా, విద్యార్థులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన ఏర్పాట్లు కల్పించడం లేదని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉంటూ రెండు, మూడు రోజులకోసారి వసతీ గృహానికి వస్తూ పోతున్నారని, విద్యార్థులు సైతం వార్డెన్ కూడా సరిగ్గా రాడని అంటున్నారని అన్నారు. దసర సెలవులు ప్రారంభం కానుండగా చివరి రోజున విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యహరించడంతో తమ పిల్లలను ఇంటికి తీసుకుని వెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవన్నారు. ఇప్పటికే ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేయగా, వార్డెన్ సురేశ్‌కు షోకాజ్ నోటీసులు పంపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. నిరసనలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, వసతీ గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ కోసం రూ.4లక్షలు



మాట్లాడుతున్న వైస్ చైర్మన్

చెన్నూర్: మున్సిపాలిటీ నుంచి బతుకమ్మ వేడుకల కోసం రూ.4లక్షల నిధులను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ కేటాయించినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం కౌన్సిలర్లుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు తొమ్మిది రోజులు ఆనందోత్సవాల మధ్య జరుపుకునే బతుకమ్మ సంబరాల కోసం ఏటా నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. రూ.4లక్షలతో 18 వార్డులలో ఎల్ఈడీ లైట్లు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జోడు శంకర్, దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీనివాస్, జాడి తిరుపతి, మేడ సురేశ్‌రెడ్డి, ఆరీఫ్‌లు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. బీఎస్ఎన్ఎల్ డీఈ కొండల్‌రావు మాట్లాడుతూ.. భారతీయ టెలీకాం రంగంలో బీఎస్ఎన్ఎల్ అక్టోబర్ 01, 2000వ సంవత్సరంలో ఏర్పాటైందన్నారు. ఈ సందర్భంగా గత నెల 28న నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు.

5న రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: అక్టోబర్ 5న మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, బెల్లంపల్లి, చెన్నూర్ శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించాలని, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1998-99విద్యార్థులు

మంచిర్యాలటౌన్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీలో గల శ్రీ భగత్‌సింగ్ విద్యామందిర్‌లో 1998-99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25ఏళ్ల తరువాత మంగళవారం కలుసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి, ప్రస్తుతం వారి స్నేహితుల కుటుంబాల గురించి ఆరా తీసుకుని, నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్



టగ్‌ఆఫ్‌వార్‌లో శిక్షణ కానిస్టేబుళ్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కానిస్టేబుళ్లకు స్పోర్ట్స్ మీట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం పరుగు పందెం, రిలే పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్, లాంగ్ జంప్, హై జంప్, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు పోటాపోటీగా సాగాయి. బుధవారం స్పోర్ట్స్ మీట్ ముగియనుండగా.. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని కమాండెంట్ వెంకటరాములు తెలిపారు. పోటీలను అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్ రావు, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి గ్రామసభలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో బుధవారం ఈజీఎస్ పథకంలో భాగంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్ర సాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి గ్రామసభలు నిర్వహించండి

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నేటి నుంచి ఉపాధిహామీ పనుల ఎంపికకు గ్రామసభలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఏడీ ఎస్ఎల్ఆర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి మంగళవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

చదరంగం ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం ఎంపిక పోటీలు ఈ నెల 4న మందమర్రి లిటిల్ ఫ్లవర్ స్కూల్లో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కనకయ్యను సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విన్నర్స్ పబ్లికేషన్స్ అడ్వైజర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ మంగళవారం విద్యార్థులకు 250పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కోట్నాక

దండేపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను తెలంగాణ గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

భీమారం: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరికి పీఎంఎస్‌బీవైలో భాగంగా మంజూరైన బీమా నష్టపరిహారం చెక్కులను మేనేజర్ నామినీలకు అందజేశారు. భీమారం గ్రామానికి చెందిన మాటేటి తిరుపతి, ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం తిరుపతమ్మలు మృతి చెందగా వారి కుటుంబాలకు ఒకొక్కరికి రూ.2లక్షలు మంజూరైనట్లు మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు.

'బాధితులకు బాసటగా నిలిచిన కేవీపీఎస్'

పాతమంచిర్యాల: దళితులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేఖంగా పోరాటాలు చేసి దళితులకు కేవీపీఎస్ బాసటగా నిలిచిందని కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సమితి జిల్లా కార్యదర్శి, దూర్కె మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం, నాయకులు నాని, కుమార్, రాములు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవ



సబ్బెపల్లి పాఠశాలలో విద్యార్థులతో మానవహారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా కార్యక్రమాల్లో నిరంతరం భాగస్వామ్యమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీపార్కులో శ్రమదానంలో పాల్గొన్న ఉద్యోగులు

గాంధీపార్కులో శ్రమదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గాంధీ పార్కులో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రమదానం నిర్వహించారు. రిలయన్స్ వ్యాపార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పాల్గొనగా, 2వ తేదీన నిర్వహించే గాంధీ జయంతి వేడుకల సందర్భంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పార్కును శుభ్రపరిచారు.

బొగ్గుబాయి వార్తలు

త్వరలో కొత్త గనులు



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో త్వరలో ఆరు కొత్తగనులు ఏర్పాటు కానున్నాయని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే 7గనిపై మంగళవారం ఆయన బాయిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ.. గత టీబీజీకేఎస్ హయాంలో 9గనులు మూసివేయబడ్డాయన్నారు. వారి హయాంలో సంస్థను ఆర్థికంగా నష్టం చేశారన్నారు. నాటి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఏ హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత, సంస్థ క్షేమం కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. నేడు లాభాల్లో కూడా వాటా శాతం పెంచి గతంలో ఎన్నడూ లేనంతగా లాభాలు ఇప్పిస్తున్నామన్నారు. కానీ టీబీజీకేఎస్ నాయకులు ఓర్వలేక తమ పై దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ యూని యన్ నాయకులు భీంరావు, కలవేని శ్యాం, తిరుపతి రాజు, ఎల్ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఆర్ మ హేందర్ రెడ్డి, ప్రేంకుమార్, రాకేశ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉన్న రూ.33వేల కోట్లను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరబద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదాలు ఆర్కే న్యూటెక్ గనిలో మంగళవారం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలకు బొగ్గు అమ్మకాలు చేసిన, కంపెనీ సరఫరా చేసిన విద్యుత్‌కు ఈ బకాయిలు రావాల్సి ఉందన్నారు. కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. బదిలీల్లో కూడా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు గజ్జి రమేశ్, చంద్రశేఖర్, సిద్దం అజయ్‌లు పాల్గొన్నారు.

'నిర్వహణ సరిగ్గా లేదు'

శ్రీరాంపూర్: నస్పూర్‌కాలనీలో కంపెనీ ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ల నిర్వహణ సరిగ్గా లేదని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లను సరిగ్గా తెరవడం లేదని, తరుచూ సాంకేతిక ఇబ్బందుల పేరుతో మూసివేస్తున్నారన్నారు. కేవలం అలంకారప్రాయంగా మిగిలాయన్నారు. వెంటనే వీటి నిర్వహణ మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు.